

బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,100
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.70,000
రిటైల్ వెండి గ్రాము రూ.72

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	31	17
తిరుపతి	31	18
తిరుమల	27	14
గూడూరు	31	20
నగరి	32	19



శ్రీకాళహస్తి చరిత్ర వెబ్‌సైట్ ప్రారంభం

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ డాట్.కం పేరిట ఏర్పాటు చేసిన శ్రీకాళహస్తి చరిత్ర వెబ్‌సైట్‌ను బుధవారం దేవస్థానం చైర్మన్ శ్రీనివాసులు ప్రారంభించారు. ఆన్‌లైన్‌లో భక్తులందరూ క్షుణ్ణంగా తెలుసుకునే విధంగా చరిత్రను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

న్యూస్‌రీల్

తప్పు చేస్తే ఇంటికే..

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్: 'బాధ్యతగా వ్యవహరించండి..తప్పుచేస్తే ఒప్పుకోను..గర్భిణులు, బాలింతలకు మేలైన సేవలను అందించండి..మంచి పేరు తెచ్చుకోండి' అని సిబ్బందిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ హెచ్చరించారు. 'సాక్షి'లో బుధవారం 'బాబుకు 2 వేలు, పాపకు రూ.వెయ్యి' శీర్షికన ప్రచురితమైన కథనంపై సూపరింటెండెంట్ తీవ్రంగా స్పందించారు. ప్రసూతి విభాగం సిబ్బంది పిలిపించి గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. ఇది ప్రభుత్వ ఆస్పత్రి అని, ఇక్కడ ప్రసవానికి వచ్చే వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. డబ్బులు డిమాండ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇకపై ఫిర్యాదులు వస్తే విధుల నుంచి తప్పించడం ఖాయమన్నారు. జాగ్రత్తగా పనిచేసుకోవాలని సూచించారు. సేవల్లో నిర్లక్ష్యం లేకుండా ప్రతి ఒక్కరూ కూడా బాధ్యతగా పనిచేయాలని సూపరింటెండెంట్ స్పష్టం చేశారు.

నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనపై గురువారం నుంచి శనివారం వరకు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి తెలిపారు. జిల్లాలోని ఈఈ కార్యాలయాల్లో వినియోగదారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చన్నారు. ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి, సీఎండీలు, ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.

పకడ్బందీగా కానిస్టేబుల్ రాత పరీక్షలు

- జిల్లాలో 33 పరీక్ష కేంద్రాలు

చిత్తూరు అర్బన్: ఈనెల 22వ తేదీన కానిస్టేబుల్ పోస్టుల ప్రిలిమినరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని చిత్తూరు అడిషినల్ ఎస్పీ జగదీశ్వర్ ఆదేశించారు. బుధవారం చిత్తూరు నగరంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిలిమినరీ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లపై పర్యవేక్షకులు, సమన్వయకర్తలతో సమావేశం నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 33 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్‌ల విధులు, పరీక్ష కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్పీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి 50 ఇళ్లకు వలంటీర్.. గ్రామానికో సచివాలయం.. రైతు భరోసా కేంద్రం.. వైఎస్సార్ హెల్త్ క్లినిక్.., డిజిటల్ లైబ్రరీ వంటి సదుపాయాలు. మన రాష్ట్రంలో తప్ప మరోచోట కనిపించని గ్రామస్థాయి పారదర్శక పాలనిది. జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి గ్రామ స్వరాజ్యానికి నాంది పలికారు. గ్రామ స్థాయిలో సుపరిపాలన అందించాలంటే ముందుగా పక్కా భవనాలుండాలని గుర్తించారు. సత్సంకల్పంతో సచివాలయ భవన నిర్మాణానికి రూ.40 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.22 లక్షలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌కు రూ.17.5 లక్షలుగా ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాలో ఇప్పటి వరకు ప్రభుత్వ కార్యాలయ భవనాలు 60 శాతం అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన పనులు యుద్ధప్రాతిపదికన సాగుతూ తుది దశకు చేరుకున్నాయి.

ప్రగతి మెరిసె..
పల్లె మురిసె..



నగరి నియోజవర్గం బుగ్గఅగ్రహారంలో రైతు భరోసా కేంద్రం

524 సచివాలయాలు — జిల్లాలో 31 మండలాలు ఉండగా, 524 రైతు భరోసా కేంద్రాలు మంజూరయ్యాయి. ఇప్పటివరకు 320 పూర్తికాగా, మరో 106 తుది దశకు చేరుకున్నాయి.

506 రైతు భరోసా కేంద్రాలు — రైతు భరోసా కేంద్రాలు 506 మంజూరయ్యాయి. ఇప్పటివరకు 255 భవనాలు పూర్తి అయ్యాయి. మరో 91 ముగింపు దశలో ఉన్నాయి.

351 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు — వైఎస్సార్ హెల్త్ క్లినిక్ 351 మంజూరయ్యాయి. ఇందులో 111 భవనాలు పూర్తికాగా, మరో 95 భవన నిర్మాణాలు 80శాతం పూర్తి చేసుకున్నాయి.

నియోజవర్గాల వారీగా...

నియోజకవర్గం	సచివాలయాలు మంజూరు	పూర్తి	రైతు భరోసా కేంద్రం మంజూరు	పూర్తి	వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు మంజూరు	పూర్తి
చిత్తూరు	26	19	25	12	22	9
పలమనేరు	94	55	88	53	57	12
పూతలపట్టు	68	15	95	47	68	21
గంగాధర నెల్లూరు	88	41	86	36	56	8
కుప్పం	81	42	77	45	58	20
పుంగనూరు	99	82	99	76	71	38
నగరి	36	13	36	16	19	3

- జిల్లాలో వేగంగా ప్రభుత్వ భవనాల నిర్మాణం
- ప్రజలకు చేరువైన సంక్షేమ పాలన
- సచివాలయ వ్యవస్థతో అంతా సులభమయ్యాయని జనం హర్షం
- మంజూరైన 1381 భవనాల్లో 716 నిర్మాణం పూర్తి
- రూ.365 కోట్లతో నిర్మాణం పనులు..
- 524 సచివాలయాల్లో 320 నిర్మాణం పూర్తి.. తుది దశలో మరో 106 భవంతులు
- 506 రైతు భరోసా కేంద్రాల్లో 255 నిర్మాణం పూర్తి.. తుదిదశలో 91 భవనాలు
- 351 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల్లో 111 నిర్మాణం పూర్తి.. తుదిదశలో 95 భవనాలు



గుడిపాల మండలం వసంతాపురంలోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనం



వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లెలో సచివాలయం భవనం

సాక్షి, చిత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రాధాన్యత భవనాల నిర్మాణ పనులు జిల్లాలో వేగవంతంగా సాగుతున్నాయి. అధునాతనమైన వసతులతో అన్ని సౌకర్యాలు ఒకే చోట ఉండేలా సచివాలయ వ్యవస్థకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆమేరకు ఒక్కో గ్రామానికి దాదాపు రూ.కోటి విలువైన ఆస్తిని సమకూర్చింది. సచివాలయాల ద్వారా ఉద్యోగులు తమ విధులు నిర్వహిస్తూ ఆ గ్రామానికి, ఆ గ్రామస్తులకు కావాల్సిన సుమారు 542 సేవలను అందిస్తూ, ప్రజల నుంచి మన్ననలు అందుకుంటున్నారు. జిల్లాలో మూడు విభాగాల్లో మొత్తం 1,381 భవనాలను ప్రభుత్వం మంజూరు చేసింది. నిర్మాణ పనులకు రూ.365 కోట్లు కేటాయించింది. ఇప్పటి వరకు మొత్తం 716 భవనాలు పూర్తయ్యాయి. వీటికోసం ఇప్పటి వరకు రూ.182 కోట్లు ఖర్చు చేశారు. మరో 300 భవనాల పనులు తుదిదశకు చేరుకున్నాయి. జిల్లా అధికార పర్యవేక్షణలో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచేలా భవన నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయి.

12 కిలోమీటర్లు వెళ్లే బాధ తప్పింది



గతంలో సర్టిఫికెట్లు, ఇతర పనులకు రామకుప్పానికి 12 కిలోమీటర్లు వెళ్లాల్సి వచ్చేది. సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత సేవలన్నీ మా గ్రామంలోనే లభిస్తున్నాయి. వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు ఇళ్ల వద్దకే వస్తున్నాయి. ఎటువంటి సమస్యలు లేకుండా ఉన్నాం. భూముల వివరాలతో అన్ని సేవలు లభిస్తున్నాయి. అన్ని వసతులతో ప్రభుత్వ భవనాలు గ్రామ స్థాయిలో నిర్మించడం సంతోషంగా ఉంది.

–బి.రేవతి, ననియాల తాండా, రామకుప్పం మండలం

అన్నీ ఒకే చోట అదృష్టంగా భావిస్తున్నా



గ్రామాల్లో రూ.కోటికి పైగా విలువైన భవనాలను ఇప్పటికే నిర్మించి గ్రామాలకు మంచి వాతావరణం తీసుకువచ్చారు. సచివాలయ వ్యవస్థతో గ్రామస్థాయిలో ఉద్యోగులు అందుబాటులోకి వచ్చారు. వలంటీర్ వ్యవస్థ బాగా పనిచేస్తుండడంతో ఎటువంటి సమస్యలు తలెత్తడం లేదు. ఒక సర్పంచ్‌గా గ్రామానికి కావాల్సిన ప్రాధాన్యత భవనాలన్నింటినీ ఒకే చోట నిర్మించడం అదృష్టంగా భావిస్తున్నా..

–రజనీకాంత్, సర్పంచ్, వసంతాపురం, గుడిపాల మండలం

సీఎం జగన్ నేతృత్వంలో గ్రామ స్వరాజ్యం



గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తలపించేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారు. గ్రామాలకు ప్రాధాన్యత భవనాల మంజూరు చేయడం ప్రజల అదృష్టం. జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 60 శాతం భవనాలు పూర్తి చేశాం. గ్రామస్థాయి పాలన విశాలమైన భవనాల నుంచి జరుగుతోంది. వలంటీర్ వ్యవస్థతో పథకాలు ప్రజల ముంగిటికే చేరుతున్నాయి. సచివాలయాలతో ఎక్కడికక్కడే అన్ని రకాల సేవలు అందుతున్నాయి.

– గోవిందప్ప శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్

ప్రాధాన్యత ప్రకారం నిర్మాణ పనులు



రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాలో ఐదు రకాల ప్రాధాన్యత భవనాలను నిర్మిస్తున్నాం. మొదటి ప్రాధాన్యత గా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. 524 సచివాలయ భవనాలు, 506 రైతు భరోసా కేంద్రాలు, 351 హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు సాగుతున్నాయి. ఇప్పటికే 60 శాతం పైగా భవనాలు పూర్తి అయ్యాయి.

–చంద్రశేఖర రెడ్డి, ఎస్ఈ పంచాయతీరాజ్ శాఖ

495 భవనాలు పూర్తిస్థాయి అందుబాటులోకి



జిల్లాకు మొత్తం 1,381 గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు మంజూరయ్యాయి. ఇందులో 495 భవనాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. మరో మూడు వందల భవనాలు ఈనెలాఖరులో అందుబాటులోకి రానున్నాయి. ఒక్కో గ్రామానికి రూ.కోటితో ఈ మూడు రకాల భవన నిర్మాణాలు సాగుతున్నాయి. డిజిటల్ లైబ్రరీలు, బీఎంసీయూల నిర్మాణాలు కూడా వేగవంతంగా సాగుతున్నాయి.

–ఎం.హరినారాయణన్,జిల్లా కలెక్టర్

కుప్పంలో బాబు ఓటమి ఖాయం

- క్షేత్ర స్థాయి నుంచి వైఎస్సార్ సీపీ బలం పెరిగింది
- ప్రజల్లోకి వెళ్లి కష్టపడి పనిచేద్దాం
- టీడీపీ దౌర్జన్యాలు ఇక సాగవు
- రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్ రెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యే వెంకటేగౌడ

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలం క్షేత్రస్థాయి నుంచి బాగా పెరిగిందని, రాబోయే ఎన్నికల్లో కుప్పంలో చంద్రబాబు ఓటమి ఖాయమని రాజంపేట ఎంపీ, లోకసభ ప్యానల్ స్పీకర్ మిథున్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని సామగుట్టపల్లె క్రాస్‌లోని ఎంఎం మహల్‌లో రామకుప్పం, శాంతిపురం, గుడుపల్లె, కుప్పం, కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మన బలం ఏమిటో మనకు తెలియదని, కష్టపడి పనిచేస్తే అనుకున్నది సాధించగలుతామని తెలిపారు. రాబోయే రోజుల్లో కార్యకర్తలు సైనికుల్లా పనిచేసేందుకు సిద్ధం కావాలన్నారు. స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 80 శాతం స్థానాలు కైవసం చేసుకుని బలపడిందన్నారు. ఈ జోరును అసెంబ్లీ ఎన్నికల్లో కొనసాగించి వైఎస్సార్ సీపీ అభ్యర్థి భరత్‌ను గెలిపించాలన్నారు. ఎవ్వరు అధైర్యపడొద్దని, అందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.


సీఎం హామీలన్నింటినీ నెరవేరుస్తాం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కుప్పంలో ఇచ్చిన హామీలన్నింటినీ చెప్పినా సమయం ప్రకారం నెరవేరుస్తామని మిథున్‌రెడ్డి తెలిపారు. హంద్రీ–నీవా కాలువ పనులు శరవేగంగా సాగుతున్నాయని, మార్చి తరువాత కుప్పంకు హంద్రీ–నీవా ద్వారా నీళ్లు తీసుకోస్తామన్నారు. ఒక టీఎంసీ రిజర్వాయర్ పనుల ప్రతి పాదనలు కూడా ప్రభుత్వానికి పంపినట్లు, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఇప్పటికే కుప్పం మున్సి పాలిటీలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు.

చంద్రబాబుకు మతి భ్రమించింది

రాష్ట్రంలో పారదర్శక పాలన అందిస్తు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాదరణ పొందుతుండంతో చంద్రబాబుకు మతిభ్రమించిందని మిథున్‌రెడ్డి ఆరోపించారు. నైతిక విలువ విలువలు లేకుండా సీఎంను అసభ్య పదజాలాలతో విమర్శలు చేయడం సరికాదన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఏదైనా మాట్లాడితే దౌర్జన్యం చేస్తున్నారని, నిందలు మోపుతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబుకు భవిష్యత్తు తెలిసిపోయి, తమ పార్టీ పనైపోయిందని మానసికస్థైర్యం కోల్పోయి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. పాదయాత్ర ఎవరైనా చేసుకోవచ్చని, దానికి ప్రభుత్వానికి అభ్యంతరం లేదన్నారు. మాట్లాడేభాష అసభ్యకరంగా ఉంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇప్పటి వరకు కుప్పంలో బూత్ ఏజెంట్లను భయభ్రాంతులకు గురి చేసి, ఇష్టానుసారంగా దొంగ ఓట్లు వేసుకుని చంద్రబాబు గెలుస్తున్నారని, ఇకపై టీడీపీ ఆటలు సాగనీవ్వనివ్వమని మిథున్ రెడ్డి హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

శాంతిపురం మండలానికి చెందిన పలువురు క్రియాశీలక టీడీపీ కార్యకర్తలు ఎంపీ మిథున్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. తిమ్మరాజుపల్లెకు చెందిన ప్రసాద్, శివ, బుజ్జి, శ్రీనివాసులు, సల్లాపురి, చంద్రబాబు, సుబ్రమణ్యం, వెంకటాచలం, ఎస్.వంశీ తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్సీ భరత్, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, అన్ని మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మండల కన్వీనర్లు పాల్గొన్నారు.

పేదలకు అన్నివిధాలా అండ



సిమెంటు బస్తాలు పంపిణీ చేస్తున్న మంత్రి రోజా

వడమాలపేట : నగరి నియోజక వర్గంలోని నిరుపేదలను అన్ని విధాలుగా ఆదుకుంటానని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం మండలంలోని ఏఎంపురం సచివాలయ పరిధిలోని ఏఎంపురం, నారాయణపురం(బట్టికండ్రిగ)గ్రామాల్లోని 27 మంది నిరుపేద కుటుంబాలకు రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా 870 సిమెంటు బస్తాలను వితరణగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను రెండు పర్యాయాలు ఎమ్మెల్యే గెలిపించిన ప్రజల కోసం ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో పాటు తన వంతు సాయం అందిస్తూ పేదలను ట్రస్టు ఆధ్వర్యంలో ఆదుకుంటున్నానని తెలిపారు. గడపకు–గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ గృహాలు లీకేజీ అవుతున్నాయని తన దృష్టికి తెచ్చారని, వారందరికీ సిమెంటు బస్తాలు పంపిణీ చేస్తున్నానని తెలిపారు. ఏఎంపురం సచివాలయ పరిధిలోని సమస్యల పరిష్కారానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయని, అందులో బట్టికండ్రిగ పంచాయతీకి రూ.5లక్షలు, ఏఎంపురం పంచాయతీకి రూ.15 లక్షలు కేటాయించినట్లు పేర్కొన్నారు. వివిధ అభివృద్ధి పనులకు తుడా నిధులు రూ.6 లక్షలు, ఎమ్మెల్యే నిధులు కూడా కేటాయించినట్లు తెలిపారు. మంత్రి సోదరుడు, వైఎస్సార్ సీపీ నేత రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ లోకేష్‌రెడ్డి, పుత్తూరు మార్కెట్ కమిటీ అధ్యక్షుడు శేఖర్, సర్పంచులు లలిత్‌కుమార్, ధర్మయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రైతులకు ఆనందం 'సెటిల్'

పలమనేరు: డివిజన్‌లో 1954 కంటే ముందు ప్రభుత్వ దరఖాస్తు పట్టాలు పొందిన రైతులకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. క్రయవిక్రయాలకు నోచు కోకుండా 22(1)(ఈ)లోని భూములపై ఉన్న నిషేధాన్ని ప్రభుత్వం ఎత్తివేసింది. ఆమేరకు సీసీఎల్ఏ జీవో నంబర్లు 649,575ను తాజాగా విడుదల చేసింది. పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయాలకు ఈమేరకు ఆదేశాలందాయి. ఈ డివిజన్‌లోని 1,650మంది రైతులకు మేలు చేకూరనుంది. భూ ములు సెటిల్‌మెంటుగా మారి రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా క్రయ, విక్రయాలకు అవకాశం దక్కింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ప్రాంతంలో 1884 సర్వే నంబర్లకు సంబంధించి 1,650మంది రైతులకు చెందిన 2042 ఎకరాల భూములు సెటిల్ మెంట్‌గా మారాయి. ఈ ప్రాంతంలోని మొత్తం సాగుభూముల్లో 60శాతం డీకేటీలుగానే ఉన్నాయి. కొత్త జీవో ద్వారా ఎక్కువగా గంగవరం మండలంలో 1,700 ఎకరాలు, పలమనేరు మండలంలో 444 ఎకరాలు సెటిల్‌మెంట్‌గా మారనున్నాయి. గతంలోని ప్రభుత్వాలకు సెటిల్‌మెంట్ భూములుగా మార్చాలని రైతులు ఎన్నిమార్లు విన్నవించుకున్నా అతీగతీలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మోక్షం కలిగించడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తర్వులు అందాయి

1954కు ముందు జారీ చేసిన డీకేటీ పట్టాలు ఇకపై రిజిస్ట్రేషన్‌లు జరిగేలా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. ఇప్పటికే మండలాల వారికి 1954కు ముందు దరఖాస్తు పట్టాలు జారీ చేసిన రైతుల జాబితాలు సిద్ధం చేశాం. ఈ జాబితాలోని రైతులు వారి భూములను విక్రయాలు చేసుకోవచ్చు.

–కుప్పస్వామి, తహసీల్దార్, పలమనేరు

రోడ్డు భద్రత అందరి బాధ్యత



రోడ్డు భద్రతా వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, డీటీసీ

చిత్తూరు కలెక్టరేట్ : రోడ్డు భద్రత అందరి బాధ్యతని కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పలు శాఖలతో వరుస సమీక్ష సమావేశాలు నిర్వహించారు. సంక్షేమ పథకాల అమలు తీరు, అభివృద్ధి పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లా ట్రాన్స్‌పోర్టు కమిషనర్ బసిరెడ్డితో కలసి 34వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను, కరపత్రాలను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 24 వరకు 34వ వారోత్సవాలను నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంవీఐలు వాసుదేవ రెడ్డి, మధుసూదన్, మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

బడిబయట పిల్లలను బడిలో చేర్పించండి

చిత్తూరు కలెక్టరేట్ : బడిబయటి పిల్లలను బడిలో చేర్పించేందుకు విద్యాశాఖ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. డీఈవో విజయేంద్ర రావు, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డితో కలసి ఎంఈవో, ఏపీఎంలతో పలు అంశాలపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. ఇందులో ప్రధాన అంశమైన అక్షరాస్యత పెంపుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో బడి బయట పిల్లలను బడిలో చేర్పించి ప్రతి విద్యార్థికి ఒక ఉపాధ్యాయుడిని అనుసంధానం చేసి బ్రిడ్జ్ కోర్స్‌ను నిర్వహించాలని ఆదేశించారు. జగనన్న గోరు ముద్దను మరింత రుచికరంగా నాణ్యతతో విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. రెండవ విడత నాడు– నేడుకు సంబంధించి పాఠశాలల్లో జరుగుతున్న 10 కాంపోనెంట్ పనులను నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

22న ఓపెన్ స్కూల్ ఓబీఈ పరీక్షలు


చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో ఈనెల 22న ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఓబీఈ (ఓపెన్ బేసిక్ ఎడ్యుకేషన్) పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్ర రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్ష జిల్లా కేంద్రంలోని కొంగారెడ్డిపల్లిలో ఉన్న గాండ్లపల్లి మునిసిపల్ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్లతో పరీక్షకు హాజరుకావాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా 65 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని డీఈవో పేర్కొన్నారు.

చలి పంజా!

చిత్తూరు జిల్లాను చలి వణికిస్తోంది. సాధారణ పరిస్థితికి భిన్నంగా శీతలగాలులు వీస్తుండడంతో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ 10 రోజుల్లో కొన్నిచోట్ల కనిష్ఠంగా 12 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. మరో మూడు, నాలుగు రోజులు చలి ఎక్కువగా ఉండవచ్చని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. చలి ప్రభావంతో గాలిలో వైరస్ వ్యాప్తి అధికంగా ఉంటుందని, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, పిల్లలు, వృద్ధులు, గర్భిణులు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. పంటలపైనా చలి ప్రభావం చూపే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

- పడిపోతున్న పగటి ఉష్ణోగ్రతలు
- రాత్రి 9 డిగ్రీల నమోదు
- పెరుగుతున్న జ్వరాలు, జలుబు, చెవి, ముక్కు సమస్యలు
- పంటలపైనా చలి ప్రభావం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న నిపుణులు

చిత్తూరు రూరల్ చలిగాలుల ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు సైతం పడిపోతున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచే ఉష్ణోగ్రతలు తగ్గుతూ తెల్లవారు జామున 3 గంటల వరకు అత్యల్పానికి చేరుకుంటున్నాయి. సాధారణంగా పగటి ఉష్ణోగ్రతలు 27 నుంచి 30 డిగ్రీల సెల్సియస్ ఉండాల్సి ఉండగా 20 నుంచి 24గా నమోదవుతోంది. రాత్రి ఉష్ణోగ్రత మరీ తక్కువగా ఉంటోంది. ఈ వారంలో పలమనేరు, వి.కోట, బైరెడ్డిపల్లి, వి.కోట, పుంగనూరు ప్రాంతాల్లో రాత్రిళ్లు సగటున 9 నుంచి 12 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఇక్కడ ఉదయం 9 గంటలు దాటినా మంచు వీడడం లేదు. రోడ్లను పొగ మంచు కమ్ముకుంటుండడంతో వాహనాల రాకపోకలతో పాటు వివిధ పనులకు కూడా అంతరాయం కలుగుతోంది. మరికొన్ని చోట్ల 12–13 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. దీంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.




పలమనేరులో కమ్మేసిన పొగమంచు, మంచుతో వాహనదారుల ఇక్కట్లు

మంచు పెరగడానికి కారణాలు

ఈసారి చలి రికార్డు స్థాయికి చేరింది. ఏటా డిసెంబర్, జనవరి నెలల్లో చలి తీవ్రత అధికంగానే ఉంటుంది. ఈ ఏడాది చాలా చోట్ల 9 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. ఇందుకు వాతావరణ మార్పులు కొంతవరకు కారణమని నిపుణులు చెబుతున్నారు. పశ్చిమ వైపు నుంచి చలిగాలులు రావడం, ఈ గాలులు మెడిటేరియన్ సీ నుంచి తేమను తీసుకురావడంతో చల్లదనం పెరుగుతోంది. అంతేగాక ఈసారి భారీవర్షాల కారణంగా చెరువులు, వంకలు నిండడమూ చలి పెరగడానికి కారణమని అధికారులు పేర్కొంటున్నారు.

అప్రమత్తత అవసరం

ఆస్తమా, న్యూమోనియా, గుండె వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఏసీ గదుల్లో ఉన్నా ఆస్తమా సమస్య ఎక్కువవుతుంది. నిర్లక్ష్యం వహిస్తే ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యే అవకాశం ఉంది. పిల్లలో ముఖ్యంగా జలుబు, దగ్గును అశ్రద్ధ చేస్తే న్యూమోనియా సోకే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు.

ఉష్ణోగ్రత వివరాలు

తేది	గరిష్ఠం	కనిష్ఠం
14	31	12-15
15	31	12-15
16	31	13-15
17	31	13-16
18	29	13-17

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- మంచు బారిన పడకుండా మాస్కులు ధరించాలి.
- దగ్గు, జలుబు, జ్వరం ఉంటే ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకోవాలి. అవసరమైతే వైద్యుడిని సంప్రదించాలి.
- మధుమేహం, గుండె జబ్బుల వారు శరీరంపై గీతలు పడకుండా జాగ్రత్త పడాలి.
- శరీరం పొడిబారకుండా చూసుకోవాలి.
- గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి. బాగా వేడిగా ఉన్న నీరు వాడకూడదు.
- వాహనాలు నడిపే వారు చేతులకు గ్లౌజులు ధరించాలి.

మామిడి పూత జాగ్రత్త



మామిడి పూతపై చలి ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇప్పటికే చాలా చోట్ల చెట్లలో పూత వచ్చింది. రానిచోట కొంత వరకు ఆలస్యం కావచ్చు. అలాగే పూత మొగ్గదశలో తేనెమంచు పురుగు, మసి తెగులు ఆశించే అవకాశం ఉంది. వీటి నివారణకు ముందుగా మోనోక్రోటోపాస్ 1.6 మి.లీ. లేదా క్లోరోపైరిపాస్ 2.0 మి.లీ. లేదా గంధకం 2.5 మి.లీ.లేదా థయోమిథాక్సన్ లేదా మ్యాంకోజెట్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

– మధుసూదన్‌రెడ్డి, ఉద్యానశాఖ డీడీ

తగిన జాగ్రత్తలు అవసరం



మంచు పడుతున్న సమయంలో బయటకు రాకుండా ఉండడం మంచిది. చల్లగాలి వల్ల ముక్కులోని కండరాలు ఉబ్బి నోటి ద్వారా గాలి పీల్చే అవసరం ఏర్పడుతుంది. తద్వారా వైరల్ ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశం ఉంటుంది. తలనొప్పి, చెవులు మూసుకుపోవడం, గొంతులో గళ్ల దిగుతుంది. మధ్య చెవిలోని పీడనం తగ్గిపోవడం వల్ల నొప్పి రావడం, చీము పట్టడంతోపాటు వినికిడి సమస్యలు వస్తాయి. సాధ్యమైనంత వెచ్చని నీరు తాగాలి. జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ పాల్ రవికుమార్, ఈఎన్‌టీ, చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి

తిరుమలలో కనిష్ట ఉష్ణోగ్రతలు

తిరుపతి జిల్లాలో కూడా చలి తీవ్రత అధికంగా ఉంది. ముఖ్యంగా తిరుమలలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కనిష్ఠంగా 9 నుంచి 11 నమోదు కాగా గరిష్ఠంగా 26 నుంచి 27 వరకు నమోదవుతున్నట్టు వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తిరుపతిలో కనిష్ఠంగా 14 నుంచి 15 డిగ్రీలు నమోదువుతున్నట్టు తెలిపారు. చలితీవ్రతకు వృద్ధులు, చంటిపిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శ్వాస సంబంధిత వ్యాధులతో బాధపడేవారు ఆస్పత్రులపాలవుతున్నారు. కొందరిని విషజ్వరాలు పీడిస్తున్నాయి. చిన్నపిల్లలకు అధికంగా జలుబు, జ్వరం లాంటి రోగాలు చుట్టుముడుతున్నాయి.

ఆస్పత్రులు కిటకిట

చలితో విష జ్వరాలు ప్రబలుతుండడంతో చాలా మంది ఆస్పత్రి బాట పడుతున్నారు. చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి రోజుకు 20 నుంచి 35 వరకు జ్వరం కేసులు వస్తున్నాయి. అలాగే ముక్కు, చెవి, గొంతు సంబంధిత కేసులు 30 వరకు నమోదవుతున్నాయి. ముఖ్యంగా చిన్న పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారు. శ్వాస సంబంధిత వ్యాధులతో ఆస్పత్రుల బాట పడుతున్నారు.

మామిడిపై చలి ప్రభావం

చలి ప్రభావం జిల్లాలో మామిడి పంట పూతపై ఎక్కువగా ఉంది. మంచుకు 70 శాతానికి పైగా పూత రాలిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 60 వేల హెక్టార్లల్లో మామిడి సాగులో ఉంది. సాధారణంగా ఏటా మామిడి పంట బాగా దిగిబడి వస్తే 5 లక్షల టన్నుల వరకు ఉంటుంది. ఈ ఏడాది చలి వల్ల 50 శాతానికి పైగా పంట తగ్గే అవకాశం ఉంది. అలాగే మామిడిని తేనెమంచు పురుగు ఆశించే అవకాశాలున్నాయి. అలాగే మిరప పూత దెబ్బతినడంతో పాటు తెగుళ్ల వచ్చే అవకాశాలు ఉన్నాయి. వరి పంట ఎదుగుదల ఆలస్యం జరిగే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

ఉద్యోగోన్నతి వద్దనుకున్నారు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ, జెడ్పీ హైస్కూళ్లలో ఖాళీగా ఉన్న ఇంగ్లిష్ టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. హైస్కూల్స్‌లో ఇంగ్లిష్ టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు ఉద్యోగోన్నతుల ప్రక్రియను నిర్వహించారు. ఈ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని 66 మండలాల్లో సీనియర్‌లైన ఎస్జీటీ టీచర్లకు ఉద్యోగోన్నతి కల్పించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. బుధవారం చిత్తూరు విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈఓ విజయేంద్రరావు పర్యవేక్షణలో టీచర్లకు కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించారు. ఉద్యోగోన్నతి అంటే సంబరపడాల్సిన టీచర్లు తమకొద్దంటూ ఎక్కువగా అన్‌విల్లింగ్ రాసిచ్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 47 ఇంగ్లిష్ పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందుకు నిబంధనల ప్రకారం 123 మంది సీనియర్ ఎస్జీటీలను పిలిచారు. ఆ 123 మందిలో 30 మంది ఉద్యోగోన్నతులు కావాలని, మిగిలిన 93 మంది తమకు ఉద్యోగోన్నతులు అవసరం లేదని లిఖిత పూర్వకంగా రాసిచ్చారు. దీంతో మిగిలిన 17 పోస్టులను భర్తీ చేసేందుకు రోస్టర్ సీనియారిటీ జాబితాను తయారుచేసి, రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు తరువాత కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్‌లు వీజీ రమణ, నాగరాజు, సిబ్బంది మురళి, గోపాల్, ప్రేమ్, జయప్రకాష్, సుబ్బు పాల్గొన్నారు.



ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈఓ, సిబ్బంది

పసికందు మృతిపై విచారణ

- అధికారులను ఆదేశించిన కలెక్టర్
- కమిటీ నియామకం

చిత్తూరు రూరల్: ఆరు రోజుల బిడ్డ మృతిపై చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం వైద్యాధికారులు విచారణ చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు నగరం సంతపేటకు చెందిన భవ్యశ్రీ అనే గర్భిణి గతనెల 14వతేదీన ప్రసవం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిని ఆశ్రయించింది. అక్కడి డాక్టర్లు సుఖ ప్రసవం చేయడంతో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే రెండోరోజు బిడ్డకు ఊపిరితీసుకోవడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇక్కడి డాక్టర్లు వెంటిలేటర్‌పై ఉంచి వైద్యం అందించిన బిడ్డ పరిస్థితి బాగలేకపోవడంతో తిరుపతిలోని రుయాకు రెఫర్‌చేశారు. తీరా అక్కడ చికిత్స పొందుతూ బిడ్డ ఆరో రోజు కన్నుమూసింది. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ హరినాయణన్ బిడ్డ మృతిపై విచారణకు ఆదేశించారు. నలుగురు డాక్టర్లతో ఓ కమిటీ వేశారు. దీంతో డాక్టర్ అరుణ్‌కుమార్, పాల్ రవికుమార్, మమత, పెంచులయ్య బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆరా మొదలు పెట్టారు. గత నెల 14, 15 తేదీల్లో డ్యూటీ చేసిన కిందిస్థాయి సిబ్బంది నుంచి డాక్టర్ల వరకు అందరినీ విచారించారు. గర్భిణి ఎప్పుడు డెలివరీ కోసం వచ్చింది? నొప్పులు వచ్చినప్పుడు డాక్టర్లు, సిబ్బంది ఏ విధంగా స్పందించారు? సకాలంలో ప్రసవ సేవలు అందించారా? ఆ సమయంలో ఎవరెవరూ ఉన్నారు? బిడ్డకు ఊపిరాడకపోవడానికి గల కారణాలు? రుయాలో ఏ విధామైన చికిత్స అందించారు..ఎలా చనిపోయారనే విషయాలపై లోతుగా విచారించారు. ఈ విచారణ పూర్తయిన తరువాత నివేదిక కలెక్టర్‌కు సమర్పిస్తామని అధికారులు పేర్కొన్నారు.



బిడ్డ మృతిపై విచారణ చేపడుతున్న వైద్యాధికారులు

చిత్తూరు ఐసీడీఎస్ కార్యాలయంలో చోరీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) రూరల్ కార్యాలయంలో దొంగలు పడ్డారు. కొంగారెడ్డిపల్లెలోని ప్రభుత్వ ఐటీఐ పక్కనున్న ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తలుపు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బుధవారం ఉదయం కార్యాలయం తెరిచి చూసిన అధికారులు, ఇక్కడున్న ప్రింటర్, స్కానర్ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, సీఐ నరసింహరాజు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

షూటింగ్ బాల్‌లో జిల్లాకు తృతీయస్థానం

రామకుప్పం: విజయవాడలో శాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–18 బాలు ర షూటింగ్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు తృతీయస్థానం సాధించినట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ మురళీకృష్ణ, చీఫ్ కోచ్ బాలా జీ తెలిపారు. ఈ విజయాన్ని మదనపల్లె బీటీ కాలేజీ దివంగత పీడీ గిరిరావుకు అంకితం చేస్తున్నట్లు షూటింగ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నరేష్‌బాబు తెలిపారు.



తృతీయస్థానం సాధించిన జిల్లా జట్టు

సారా స్వాధీనం.. నిందితుడు అరెస్టు

చిత్తూరు అర్బన్: గంగాధరనెల్లూరు మండలం కడపగుంట వద్ద బుధవారం సారా విక్రేతను స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంటు బ్యూరో (ఎస్‌ఈబీ) పోలీసులు అరెస్టు చేశారు. కడపగుంట వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా చెంగల్రాయన్ (41) అనే వ్యక్తి వద్ద 20 లీటర్ల సారా లభించింది. చిత్తూరు ఎస్‌ఈబీ స్టేషన్‌లో అరెస్టు చూపించి, మేజిస్ట్రేట్ ఆదేశాలతో రిమాండుకు తరలించినట్లు సీఐ జోగేంద్ర తెలిపారు.



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్‌ఈబీ పోలీసులు

కాలుజారి పడి వృద్ధుడి మృతి

ఏర్పేడు: కాలినడకన వెళుతూ కాలుజారి స్వర్ణముఖి నదిలో పడి ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని చెన్నంపల్లిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని చెన్నంపల్లి గ్రామానికి చెందిన నక్కా గురుస్వామి(65) సొంతపనులపై పాపానాయుడుపేటకు వెళ్లాడు. పనులు ముగించుకుని బుధవారం రాత్రి 7.30 గంటల సమయంలో తిరిగి స్వగ్రామానికి వెళ్లడానికి కాలినడకన బయలు దేరాడు. పాపానాయుడుపేట సమీపంలోని స్వర్ణముఖి నదిలోని మట్టి రోడ్డు ఒక ప్రాంతంలో తుపానుకు కోతకు గురైంది. కోతకు గురైన ప్రాంతంలో గ్రామస్తులు దాటుకునేందుకు తాడిచెట్టు, విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో గురుస్వామి దాటుతుండగా కాలుజారి స్వర్ణముఖి నదిలో ప్రవహిస్తున్న నీటిలో పడిపోయాడు. ఆపై సిమెంట్ పైపు(తూము)లో ఇరుక్కుని గురుస్వామి మృతి చెందాడు. గ్రామస్తులు గురుస్వామి మృతదేహాన్ని మంచంపై ఉంచుకుని ఇంటికి తరలించారు. స్వర్ణముఖి నదిలో కోతకు గురైన ప్రాంతంలో సక్రమంగా పైపులు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని గ్రామస్తులు వాపోయారు.

శేషవస్త్రాల వినియోగంపై ఆంక్షలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రముఖులకు వేదపండితుల ఆశీర్వచనం సమయంలో ఇచ్చే శేషవస్త్రాల వినియోగంపై ఆంక్షలు విధిస్తూ ఈవో సాగర్‌బాబు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రముఖులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి శేషవస్త్రం అందజేస్తారు. ఇప్పటివరకు ఈ శేషవస్త్రాలు పీఆర్వో కార్యాలయం నుంచి అందుతుండేవి. వాటి దుర్వినియోగం జరగకుండా చూడాలనే ఉద్దేశంతో ఆంక్షలు విధిస్తునట్లు ఈవో తెలిపారు. ఇకనుంచి ఈ వస్త్రాలు ఏఈవో, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో ఉంటాయని పేర్కొన్నారు. ఏయే ప్రముఖులకు వస్త్రాలను అందజేశారనేది రిజిస్టర్‌లో నమోదు చేయాలని, 15 రోజులకు ఒకసారి తాను తనిఖీ చేస్తానని తెలిపారు. వేదపండితుల ఆశీర్వాదానికి టికెట్ ధర నిర్ణయిస్తామని పేర్కొన్నారు.

రూ.1.5 లక్షల విలువజేసే ఆవుల అపహరణ

- టెంపోలో వేసుకెళ్లిన దొంగలు
- పోలీసులను ఆశ్రయించిన రైతు

పలమనేరు: రూ.1.50లక్షలు విలువజేసే మూడు పాడి ఆవులు చోరీ అయిన సంఘటన మంగళవారం రాత్రి పట్టణ సమీపంలోని బొమ్మిదొడ్డి వద్ద చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నటరాజ పాడి ఆవుల ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కనుమ సందర్భంగా సోమవారం పాడి పశువులను అలంకరించి పూజలు చేశాడు. మంగళవారం రాత్రి గిడ్డారెడ్డి చెరువు సమీపంలోని తన పొలం వద్ద షెడ్డులో ఆవులకు మేతవేసి ఇంటికొచ్చాడు. అయితే రోడ్డుకు సమీపంలోని ఈ పశువుల షెడ్డుపై ముందుగానే రెక్కీ చేసుకున్న దొంగలు రోడ్డుపక్కన టెంపోను ఆపి ఉంచుకుని పశువుల కొట్టంలోని దూడలను వదిలి మూడు పాడి ఆవులను మాత్రం తోలుకొచ్చి టెంపోలో ఎక్కించుకొని వెళ్లిపోయారు. వేకువజామున షెడ్డువద్దకొచ్చి చూసిన రైతు చోరీని గుర్తించాడు. దీనిపై స్థానిక పోలీసులకు ఫర్యాదు చేశాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు షెడ్డు వద్ద టెంపో నిలిపిన టైరు మార్కులను గమించారు. కన్నమాకులపల్లి మీదుగా గొల్లపల్లె మార్గంలో పశువుల టెంపో వెళ్లి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఆమేరకు బైరెడ్డిపల్లి దాకా కుప్పం రోడ్డుపై ఉన్న సీసీ కెమెరా పుటేజీలను పరిశీలిస్తున్నారు. పొలాల వద్ద షెడ్లలోని పాడి ఆవులు చోరీ అవుతుండడంతో ఈ ప్రాంతంలోని పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు.



చోరీకి గురైన పాడి ఆవులను కనుమరోజు పూజ చేసి రైతు తీసుకున్న ఫోటో

సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు

- నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా ఐదు రోజుల పాటు క్యాంపులు
- ఆధార్ అప్‌డేట్ చేసుకోని వారికి సదవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సౌకర్యం కోసం కీలక నిర్ణయం తీసుకుంది. జిల్లా వ్యాప్తంగా సచివాలయాల్లో గురువారం నుంచి ఐదు రోజుల పాటు ప్రత్యేక ఆధార్ క్యాంపులను నిర్వహించనుంది. రెండవ విడతలో ఫిబ్రవరి 7వ తేదీ నుంచి 10 వరకు క్యాంప్‌లను నిర్వహించనున్నారు. జిల్లాలోని 31 మండలాల్లో శిబిరాల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని క్షేత్రస్థాయి సిబ్బందికి కలెక్టర్ హరి నారాయణన్, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ సూచనలు ఇచ్చారు. ఆధార్‌కార్డుల జారీ సంస్థ యూఐడీఏఐ ఇటీవల కొత్తగా తీసుకొచ్చిన నిబంధనల ప్రకారం పదేళ్లల్లో కనీసం ఒక సారి బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలి. ఇలా అప్‌డేట్ చేసుకునేందుకు, పలు రకాల ఆధార్ సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఇంత వరకు ఆధార్ కార్డు లేని వారు, చిన్నపిల్లలకు ఉచితంగా నమోదు చేయనున్నారు.



సచివాలయాల్లో ఆధార్‌సేవలు (ఫైల్)

గతంలో గంటల తరబడి క్యూలైన్‌లో..

ఆధార్ సేవల కోసం గతంలో ప్రజలు గంటల తరబడి ప్రైవేట్ కేంద్రాల వద్ద క్యూలైన్‌లో నిలబడాల్సిన దుస్థితి ఉండేది. ఇప్పుడు అలాంటి సమస్యలకు అవకాశం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ సేవలను అందిస్తోంది. దీంతో ఎంతో మేలు కలుగుతోందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలకు ఎంతో ఉపయోగం

ప్రజలకు ఆధార్ సేవలను చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల్లో ప్రక్రియను మొదలు పెట్టింది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో, మున్సిపల్ పరిధిలో ఈ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించాం. ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం గురువారం నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంప్‌లను నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు చేపడుతున్నాం. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

– హరి నారాయణన్, కలెక్టర్, చిత్తూరు